# దేవుడొచ్చాడు

వీరాజీ

పిల్లిని తరిమే కుక్కలాగ, చాలా హడావిడిగా ఆటో రిక్షాని తీసుకువచ్చి, తన గుమ్మంలో సడన్ బ్రేకు వేసి, అందులో నుంచి ఇంట్లోకి దూసుకుపోయాడు శ్రీను. నైట్ డ్యూటీ కెళ్లిన మొగుడు అట్లా రావడం కొత్తకాదు కనుక - శ్రీను పెళ్లాం కనీసం ఇటు తిరగనైనా లేదు. "నఖరాలు మాని తొందరగా లెగిసి, బయట మనింటి పక్క జాగా వూడ్చి నీళ్ల జల్లెహె" అన్నాడు శ్రీను. ఈ మాటలకు అచ్చెరువు చెందిన రవణ యిటు తిరిగి, "ఎట్టా? ఏంటా తొందర...మినీస్టర్‌లొత్తన్నారా? ఏంటి?" అంటూ లేచి నిలబడ్డది.

"మినిస్టర్‌లేందే ఎట్టీమొహమా?...మనింటికి దేవుఁడొచ్చాడే" రొప్పుతూ చెప్పాడు శ్రీను. భార్యకు తానే చీపురు అందించాడు. "మన అదురుష్టం అనుకో.."అంటూ బయటకు దూసుకుపోయాడు.

"దేవుడా?...ఏంటండీ బొరతగారూ....పొద్దున్నేవో రొండైపోనాదేంటి? దేవుఁడేంటి?"-

"కాదే...నిజంగానే, సత్తెప్రెమాణకంగా...యిట్లా బయటకొచ్చిసూడు..."కేకేశాడు. సంభ్రమంగా వచ్చి, ఆటోలోకి చూసింది రవణ. సీటు మీద ఒక తువ్వాలులో మూటగట్టి యేదో పెట్టుంది. "అదే దేవుఁడు" అన్నాడు శ్రీను!


శ్రీను తన భార్యకి అంతా వివరించి చెప్పాడు. రవణకి కాలూ, చెయ్యీ ఆడలేదు. "ఒలమ్మోలమ్మో!" అనుకుంటూ గుండెలమీద చెయ్యేసుకుంది. పరిగెత్తింది అప్రయత్నంగా.

అరగంటలో ఆ మహానగరం రాదారి పక్కనున్న ఆ మురికివాడలోని శ్రీను గుడిసె పక్కన చీటీ పాటలు జరిగే చదరపు ఖాళీ మెరక జాగాలో ముగ్గులు వెలిశాయి. అక్కడికి దగ్గరలోనేవున్న శ్రీసాయిబాబా అయ్యప్పా శ్రీవెంకటేశ్వర దుర్గా షామియానాల అంగడి నుంచి షామియానా బల్లలు వచ్చేశాయి. అక్కడో వేదిక తయారైంది. జనం యింకా బద్ధకంగా వున్నారు..ఆటోలో, మూటలో వున్న దేవుణ్ని మెల్లగా, రెండు చేతులా అందుకున్నాడు, చెప్పులిప్పి దూరంగా తోసేసి మరీ శ్రీను. మూటలోని శాల్తీని వేదిక మీద, దిండు మీదికి తలలు ఆనేలాగ, కూర్చోబెట్టాడు. ఒక తలకాదు రెండు తలలున్నాయి - ఆ దేవుడికి. "గబగబా, శ్రీను భార్య, ఎదురింటి మేస్త్రీ భార్యా కలిసి - ఆ రెండు తలకాయలకి పసుపు కుంకుమ మెత్తారు. లెంపలేసుకున్నారు. "అమ్మో...దేవుడేటి? యిలాగొచ్చేశాడు మన పేటకి! అంటూ లెంపలేసుకున్నాడు మరోసారి.

ఆ దేవుఁడికి రెండు తలలు, ఎంతో తీరుగా వున్నాయి. నాలుగుచేతులు వున్నాయి. కాళ్లున్నాయి గాని సన్నగా, చిక్కి వున్నాయి. పచ్చని దబ్బపండు ఛాయతో మెరిసిపోతున్న ఆ బొమ్మలాంటి పదార్థం ఒక విచిత్రమయిన పసిగుడ్డు! ఏ తల్లి పారేసిందో? కాని, అలా అనుమానం వచ్చిన వాళ్లు బయటికొక్కమాట అనలేదు!

అరమోడ్పు కన్నులతో చూస్తున్నట్లున్నాయి 'దాని' ఉబ్బిన కనుగ్రుడ్లు.

జనం మూగారు. షామియానా కొట్టువాడు ముందు కొబ్బరికాయ తెచ్చికొట్టాడు. టీ కొట్టు బాబ్జీ వూదొత్తులు



కట్ట పూర్తిగా వెలిగించి, ఒక సిల్వరు ముంతలో బియ్యం పోసి, అందులో అగరబత్తీలు గ్రుచ్చి, "దేవుడి"ప్రక్కనే పెట్టాడు. గుప్ గుప్‌న సాంబ్రాణీ ధూపం వేశాడు కార్పెంటర్ రత్తయ్య.

'సాచ్చాత్తూ తిరుమూర్తులవారు...మన పేటకి వొచ్చేశారు...కిరాణా కొట్టాయన యింటికెళ్లి దీపం సెమ్మాలు వొట్రండి...దీపాలెట్టి, హారతులియ్యంహే- రేపీపాటికి మనపాకలు మిద్దెలైపోతాయి...."అంటూ తాయెత్తుల మరిడయ్య లెంపలేసుకుంటూ- గోవిందా...గోవిందా! బ్రమ్మాయిష్ణూ మగేశ్వరుడా!" అంటూ సాష్టాంగదండాలెట్టేస్తున్నాడు!

ఆ మురికివాడ - వాడంతా-దేవుడొచ్చాడన్న వార్త పెట్రోలు మంటలాగ వ్యాపించిపోయింది. పనీ,పాటాలేని జనాలొచ్చేశారు! కిరాణా అంగట్లో కర్పూరం పేకెట్లు అయిపోయాయి. కొబ్బరికాయలు ఒక్కటయినా మిగల్లేదు.

తలోటీ కొనుక్కొచ్చి - దేవుడికి కొబ్బరికాయలు కొట్టడం, హారతులు పట్టడం- ఆటో శ్రీనుని - నీకేట్రా? యింత అదురుష్టం...ఎక్కణ్నుంచి తెచ్చేశేవురా యీ బతికున్న దేవుణ్ణి?" అంటూ అభినందించడం....

"దేవుడు" లో యింకా చిన్న పిసరు ప్రాణం వున్నట్లే వుంది.

ఆటో డ్రయివర్ శ్రీను డబ్బు లేరుకోడంలో నిమగ్నమై వున్నాడు. అతని నుదిటి నిండా విబూది. పెద్ద కుంకుమబొట్టు. చెవులో పువ్వు! పోయినేడాది అయ్యప్ప దీక్షకు కొనుక్కున్న నల్లలుంగీ, చొక్కా బయటకు తీసి ధరించి గొప్ప దీక్షాపరుడిలాగ వున్నాడు శ్రీను - అక్కడో తెల్లని గుడ్డ పరిచారు. దానిమీద పావలాలు, అర్ధలు,రూపాయిలూ కూడా అలా పడుతూనే వున్నాయి!

రమేషన్న- అంటే ...వాడ కట్టు రౌడీ వచ్చాడు.

"జై కనకమహాలచిమీ జై...ఎవరే యీ దేవుఁడూ...ఏరా శ్రీనూ? మన సంగతి తెల్సుగా?" అంటూ జనాన్ని వెనక్కినెట్టి, పూల దుప్పటీ మీద దరిజాగా నడుం క్రింద దిండెట్టుకుని పండుకున్న బాల తిరు(త్రి)మూర్తిని చూశాడు. నాలుగుచేతులున్నాయి. రెండు తలలున్నాయి. ఏటి-మొహంలో గొప్పకళ? బ్రహ్మాండమయిన దేవుడి మహిమ అగపడిపోతాంది" అంటూ ఆ పసిగ్రుడ్డు కాళ్లకిమ్రొక్కి మీసాలకి ఆ చేతులు అటూ,ఇటూ త్రిప్పుతూ రాసుకుని, "వొరే శీనూ...బొక్కుల సంగతి రవణమ్మ చూసుకుంటదిగాని- నువ్విలా ,వోపాలె రా రా" అంటూ శ్రీనుని పక్కకి లాక్కెళ్లాడు.

దేవుడుఁ నిద్దరోతున్న "బాలబ్రమ్మ"లాగున్నాడు. "బ్రహ్మదేవుఁడు" అన్నారు కొందరు. తిరునాధస్వామి అన్నారు మరికొందరు. నాలుగు చేతులున్నాయి-యిష్ణుమూర్తి శివుడు కలిసి శివకేశవులు అయ్యాడన్నమాట- అన్నారు వాడలోని వయస్సు మళ్లిన మహిళలు. వాళ్లదే సందడి.

ఆ మురికివాడకి దేవుఁడొచ్చాడన్న వార్త మెయిన్ రోడ్డుకిప్రాకి, డ్యూటీలకెళ్లే ఆసాములు, వుద్యోగులు, అన్నిరకాల వాహనాలను ఆ ప్రక్క మెయిన్ రోడ్డుమీద ఆపేసి-వచ్చి, షామియానా క్రింద వెలసిన గుడినీ, అందులోని దేవుఁణ్ణి వింతగా చూడసాగారు!

ఓ,బామ్మగారంది - "మూడో తలకాయ యేదీ? త్రిమూర్తి అంటే...మూడు తలకాయలుండొద్దా?..."

"బహుశా వెనక వేపుందేమోలే మూడో తల"- అని ప్రదక్షిణలు చేస్తున్నట్లు చుట్టూ తిరిగింది. ఆ కొనవూపిరితో వున్న అనాధశిశువు చుట్టూ తిరిగిన ఆమె, " మనకెందుకులే- తన్నినా తంతారు దిక్కుమాలిన జనం అనుకుంటూ-" "ఓం నమశివాయః ఓం గోవిందాయ, ఓం వెంకటేశ్వరాయనమః అనుకుంటూ వెళ్లిపోయిందా తెలివైన మహిళ.

దాదా రమేష్, ఆటోశ్రీను, మెకానిక్ మాణిక్యం, వాడకట్టులోని మరో పెద్ద, కొబ్బరిబొండాల బండీ సిమ్మాద్రి, యిలా తమ పేరుతో అవతారం ఎత్తిన దేవుఁడికి అక్కడ వో గుడి కట్టాలని తీర్మానించారు. మీటింగులయ్యే జాగా ఒకరిదేటి? గవర్నమెంటుది...అంటే జనాలది...అనగా అవతారమెత్తిన యీ బాలబ్రహ్మాది. కనుక, ముందుగా జాగాకి దడి కట్టేయాలన్నారు. ఆటో శ్రీను చెప్పాడు - "దేవుఁడు ముందు నా కలలోకొచ్చాడు. కొండమీద గుహలో వుంటాను...రారా శ్రీనూ! నన్ను తీసుకపోయి నీ యింటిప్రక్కన మందిరం కట్టి, అదేంటో - 'పెతిష్టాపణ' అంటారే, అది చెయ్యమన్నాడు...కనుక, ఈ జాగా నాకు యిప్పించమని కార్పొరేటరు నూకాలయ్యని కోరాల" అంటూ తీర్మానం పెట్టాడు.

షామియానా అప్పలరాజు, కిరాణా కొట్టు వరహాలయ్యా కూడా దేవుఁడి సంఘంలో సభ్యత్వం కావాలన్నారు. సరేనన్నాడు ఆటో శ్రీను.

రవణా-రిక్షా డ్రయివరు పెళ్లాం కొండలూ, మరో యిద్దరు, ముగ్గురు వాడకట్టు పెద్దలు- మొహాలకి పసుపులు రాసేసుకుని, తలారా స్నానాలు చేసి, ముడివేసుకున్న కొప్పులలోనుంచి నీళ్లు కారుతూ వుండగా దేవుడి పూజలు మొదలెట్టారు. జనాలకి బెల్లం నీళ్ల కారుతూవుండగా దేవుడిc పూజలు మొదలెట్టారు. జనాలకి బెల్లం నీళ్ల తీర్థం అందించడం వగైరా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు...ఆటో శ్రీను, రమేషన్నా-మంతనాలు పూర్తిచేసి, అక్కడికొచ్చేసరికి- వాచ్‌మాన్ వుద్యోగం చేసి, రిటైరయిన చలమయ్య- రహస్యం చెప్పినట్లు అన్నాడు...."ఏదో వాసనొస్తున్నదిరా...."అని.

"ముసిలినాయాళా....దేవుఁడు కంపుకొడతాడేంటిరా? అది ఆ, అగరొత్తుల్లో కల్తీ వుంది గావాఁల... ఆ వోసన, అంతే," నన్నారు ట్రస్టీలు.

కానీ, వాళ్ల ముక్కులకీ, అనాధశిశువు మృతశరీరం కుళ్లిపోతుందేమోనన్న అనుమానం వచ్చింది..."దేవుఁడికి యిక్కడే సమాధి కట్టాల,"అన్నాడు శ్రీను. "సమాధి మీద గుడి కట్టాల"అన్నాడు జంగమయ్య నందికేశుడు.

"ఒరేయ్ లగెత్తుకెళ్లి కేబులోళ్లని (అంటే సిటీఛానల్ కెమెరాలవాళ్లని) పిల్చుకురారా..."అన్నాడు శ్రీను. పేపరోళ్లా రాలేదు...టి.వీ వోళ్లా రాలేదు....కుక్క చచ్చినా, మేక బ్యారుమన్నా వచ్చి కాకుల్లా వాలిపోతారు నాయాళ్లు" అంటూ వాడు తన మనుషుల్ని హుటాహుటీ పరుగెత్తించాడు.

"ఆటో శ్రీనుకి దేవుఁడు దొరికాడు" అన్నది విచిత్రవార్తగా టి.వి.లో, పత్రికల్లో రావాలి. అప్పుడే వాడికి ఆ జాగా మీదా, కట్టించబోయే సమాధిమీదా హక్కు....ఆ మాత్రం తెలియని వాడు కాదు. ప్రతీ రోజూ సినిమాలకెళ్తాడు వాడు. చాలా "నాలేజీ"వుంది శ్రీనుకి"

- బారెడు పొద్దెక్కింది. టి.వి.వాళ్లు రాలేదు. పేపరోళ్లు ఎక్కడ చచ్చారో..." మినిస్టరొచ్చాడు గాఁవాఁల...గాజువాకకి...ఇటు దేవుడు వొచ్చాడంటే ఆళ్లకేటి లాబం? అంచేత, అటు దొబ్బేసినారు" అనుకున్నాడు శ్రీను.

"వొరేయ్ శ్రీనూ! దేవుడి భౌతిక కాయాన్ని పూడ్చేయండయ్యా!" అంటూ భయం భయంగా చెప్పారు ఆ ప్రక్కనున్న ఫ్లాట్‌ల వాళ్లు.

శ్రీను కనులు పొడుచుకుని, మెయిన్ రోడ్డు వైపే చూస్తున్నాడు. దేవుఁడి మీది పూలు వాడిపోయి, అగరొత్తులు కాలిపోయి, బ్రహ్మాదేవుడు రెండు తలంతా ఉబ్బిపోయి, కొంచెం భయంకరంగా వికారంగా అయిపోయాడు. చిన్న కంపు కూడా వస్తున్నాడు. దేవుఁడి ముందు పడ్డ డబ్బుల్ని, మాత్రం- 'సమాధి కట్టాలిగా" అంటూ కళ్ల కద్దుకుని, రమణమ్మ, రమేష్ గాల్‌ఫ్రెండ్ రమ్యక్రిష్ణ - దాన్నలా అంటారు. అసలు పేరు పెంటమ్మ - సంగ్రహించి లోనకి తీసుకుపోయారు.

దూరంగా ఎర్రదీపం వ్యాను వస్తూ కనిపించింది. "పోలీసోళ్ల యేను వచ్చేస్తాందిరా" అన్నాడు బుల్‌బులయ్య వాయింపు ఆపి, వాడి బుల్‌బుల్ తీసుకుని పారిపోతూ.

శ్రీనుకి గుండెలు కొట్టుకున్నాయి. " టి.వి.వోళ్లని రానీండయ్యా- సాచ్చాత్తూ బ్రహ్మాదేవుఁడు నాకు దొరకటమేంటీ... మీరు దౌరిజన్యంగా నన్ను లాక్కుపోడమేంటీ?" అంటూ వారించాడు శ్రీను.

"చాలా దూరమెళ్తాంది గురో! కత... ఫైరింగ్ దాకా ఎళ్తాది యాఁవనుకుంటున్నావో? యిది పేదోళ్ల సెంటిమెంట్ యెవ్వారం" అన్నాడు రమేషన్న.

పోలీసులు వింటారా? "పోరా! బోస్‌డీకే రౌడీనాయాళా" అన్నారు.

అరగంటలో దేవుఁడి మూటతో సహా శ్రీనునీ, సాక్ష్యానికి మరో నలుగురు పెద్దలినీ పోలీస్‌స్టేషన్‌కి లాక్కుపోయి కూచోబెట్టారు. దేవుణ్ని మూటకట్టి వో ప్రక్కన లాకప్ సెల్ ముందు, తలుపు దెగ్గర పెట్టారు.

శ్రీను వొప్పుకున్నాడు. రాత్రి సెకెండు షో ఆట అయినాకా, మువ్వలవానిపాలెం బేరం వేసుకొని, తిరిగి వొస్తూ రోడ్డువార ఆగి వో కునుకు తీశాడు. దేవుఁడు కల్లో కొచ్చాడు. "వొరే శీనూ! నేను ఫలానీ దగ్గర అవతారం ఎత్తానురా...నన్ను తీసుకెళ్లరా,"అన్నాడు దేవుడు. అలాగే చేశాడు శ్రీను. అదేవాడు చేసిన తప్పుపని. పోలీసోళ్లు ఏదీ నమ్మరు. ఆటో శ్రీను దేవుడి కోసం యీ పనిచేశాడు అని నమ్ముతారా? "ప్చ్! పాడులోకం! మంచిపనికి యిలవలేదు" అన్నాడు యించుమించు ఏడుస్తూ శ్రీను.

"వొరేయ్! నీ దేవుఁడు కంపుకొడతన్నాడేందిరా...?" రైటర్ అడిగాడు.

"నీ కళ్లు పోతాయి రైటర్ బాబూ," అన్నాడు శ్రీను. దేవుఁడు పోలీసు స్టేషన్‌కి వస్తాడేంటి బాబూ?...మాయమైపోయాడెప్పుడో"అన్నాడు. పైకి ఆకాశం వేపు వేలెత్తి చూపెడుతూ....

- వోరి ఎదవదొంగ మాయనాయాళా! నిన్నరాత్రి గోషాసుపత్రిలో వో విచిత్రమయిన పసిపిల్లనెవరో ఎత్తుకుపోనారని కంప్లయింటు వచ్చినాదిట్రా వన్ టవున్ టేసన్‌కీ! నీ మక్కెలిరిచి, బొక్కలో తోసెయ్యడానికి వన్‌టవునోళ్లు రావాల యిప్పుడు - అప్పుడు నా కళ్లు కాదురా - నీ కాళ్లు యిరిగిపోతాయ్!" అన్నాడు రైటర్, కారాకిళ్లీ పళ్లతో యికిలిస్తూ....

బ్రహ్మాదేవుడి మూటని కె.జి.హెచ్.కి పంపించేశారు. "పోస్టుమార్టమ్ లేకుండా, పేథాలజీ డిపార్ట్‌మెంటుకి తీసుకుపోదాం...పనికొస్తుందో, లేక కుళ్లిపోయిందో శవం చూడండి" అన్నాడు ప్రొఫెసర్ వెంబుగారు. ఇది స్టూడెంట్స్ స్టడీకి అవసరం అన్నారు తతిమ్మా డాక్టర్లు.

అప్పుడొచ్చారు పేపరువాళ్లు. శ్రీను వాళ్లని కదలకుండా పట్టుకున్నాడు.- " నా తప్పులేదు. దేవుఁడో... నా యింటికి దేవుఁడు వచ్చినాడు దేవుడో...కాని, యిది కలికాలం దేవుడో, పోలీసోళ్లు దేవుణ్ణి చంపేశారు దేవుడో..." అని వాడు వీరంగం వేస్తుండగా వీళ్లు ఫోటోలు తీసుకున్నారు. వాడి మాటలు రికార్డు చేసుకున్నారు. టి.వి.ఛానల్‌వాళ్లు కామిరా ఆఫ్ చేసేదాకా శ్రీను "కథాకళి" ఆపలేదు. ఆనక గప్‌చిప్‌న వన్‌టౌన్ పోలీసు లాకప్‌కి వ్యానులో, మౌనంగా గంభీరంగా ప్రయాణం సాగించాడు! ●


## తెల్లమచ్చలు

అనేక సంవత్సరముల నిరంతర పరిశ్రమ, పరిశోధన తరువాత తెల్లమచ్చల చికిత్సలో విజయమును పొందియున్నాము. మా చికిత్స ఎంతో ప్రభావకరమైనది. త్వరితముగా పని చేయునది, అంటే చికిత్స ప్రారంభించిన వెంటనే మచ్చ యొక్క రంగు మారుటకు మరియు మచ్చలు ఏర్పడుటకు గల శరీర అంతర్గత వికారములు దూరము చేస్తూ మచ్చలను నివారిస్తూ, శాశ్వతముగా సహజ చర్మపు రంగులోనికి మారుస్తుంది. ఇప్పుడు ప్రచారము నిమిత్తము 'మొదట పరీక్షించి చూడండి' అను స్కీమును అనుసరించి 7 రోజుల మందు ఉచితముగా ఇవ్వబడుతున్నది. మొదట మందుల ప్రభావమును పరీక్షించి సంతృప్తులైన తరువాత చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు, ఇతరుల వద్ద చికిత్స పొందుతున్న రోగులు కూడా ఈ అవకాశమును తప్పక ఉపయోగించుకోగలరు. రోగి యొక్క వయస్సు, మచ్చ గల స్థానము మరియు మచ్చలు ఎన్ని రోజుల నుండి ఉన్నది పూర్తిగా తెలియజేయండి.

## గుప్తరోగములకు ఉచిత మందు

ప్రాచీన ఆయుర్వేద గ్రంథ విజ్ఞానాన్ని మధించి గడిచిన అనేక సంవత్సరముల పరిశోధన తరువాత మాచే తయారుచేయబడిన పరీక్షితమైన మందుల ద్వారా గుప్తరోగముల చికిత్సలో పూర్తి విజయమును పొందియున్నాము. ఈ మందుల ద్వారా స్వప్నదోషము, మూత్రము ద్వారా వీర్యము పోవుట, స్పెరన్‌టోరియా, శ్రీఘ్రస్ఖలనము, నపుంసకత్వము, అంగబలహీనతలు మొదలగునవి పూర్తిగా తగ్గిపోవును. శరీరములో నూతన ఉత్సాహమును అనుభవించగలరు. రతి సామర్థ్యము పెరుగును. పురుష మందులను పరీక్షించి నమ్మకమును పొందగలరని ప్రచారము నిమిత్తము 7 రోజుల మందును ఉచితముగా ఇస్తున్నాము. రోగులు ఫలితమును చూసి, సంతృప్తులైన తరువాత పూర్తి చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు ఒక్కసారి మందు వాడి చూడండి. రోగి వయస్సు, సమస్యలు పూర్తిగా నిస్సంకోచముగా వ్రాయగలరు. పూర్తి చికిత్స ఒకేసారి తీసుకోవాలని అనుకునేవారు కూడా వ్రాయవచ్చును.

## తెల్లవెంట్రుకలు, వెంట్రుకలు రాలుటను అరికట్టు చికిత్స

ఏ సమయములోనైనా ఏ కారణము వల్లనైనా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట జరిగినచో చింతించవద్దు. ప్రాచీన ఆయుర్వేద గ్రంథములలోని పరీక్షితమై నమూనాలు ఆధారముగా తయారుచేయబడిన మందుల ద్వారా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట పూర్తిగా తగ్గిపోవును. క్రొత్త వెంట్రుకలు నల్లగా, దట్టముగా పెరుగును. మెదడును చల్లగా నుంచును. జ్ఞాపశక్తిని వృద్ధి చేయును. వయస్సు, తెల్లవెంట్రుకలు లేదా వెంట్రుకలు రాలుట ఎంతకాలము నుంచి ఉన్నది, స్త్రీ లేదా పురుషులా వివరముగా తెలుపగలరు. చికిత్స కొరకు వ్రాయగలరు. ధర రూ. 120/- స్పెషల్ కోర్సు రూ. 210/-.

**SHYAM AYURVED BHAVAN MV-98**
**POST KATRISARAI (GAYA) 805 105**